సాక్షి
పెద్దపల్లి
సోమవారం । 20 । జనవరి । 2025



మల్లన్నకు పట్నాలు.. నైవేద్యం

ఓదెల(పెద్దపల్లి): 'ఓదెల మల్లికార్జునస్వామీ.. మమ్మల్ని సల్లంగా చూడు స్వామీ'.. అని భక్తులు పూజలు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. తొలుత కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. కోడెమొక్కు చెల్లించుకున్నారు. విఘ్నేశ్వరుడు, ఖండేలరాయుడు, శ్రీసీతారామచంద్రస్వామి, నందీశ్వరులను దర్శించుకున్నారు. ఒగ్గుపూజారులతో స్వామివారికి పట్నాలు వేయించారు. బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

'క్రీడలతో స్నేహభావం'

సుల్తానాబాద్(పెద్దపల్లి): క్రీడా పోటీలతో స్నేహభావం పెంపొందుతుందని మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి గణేశ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోలీసులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో ఆదివారం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా చేపట్టిన పోటీలను జడ్జి ప్రారంభించి మాట్లాడారు. నిత్యం విధుల్లో ఉండే ఉద్యోగులకు క్రీడలు మానసిక ఉల్లాసం, నూతనోత్తేజం కలిగిస్తాయని జడ్జి అన్నారు. కాగా, న్యాయవాదుల జట్టుపై పోలీసు జట్టు విజయం సాధించింది. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సైలు శ్రవణ్‌కుమార్, సనత్ కుమార్, లక్ష్మణ్‌రావు, వెంకటేశ్, సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములుగౌడ్, కార్యదర్శి జోగుల రమేశ్, ఏజీపీ ఆంజనేయులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగిన పోలీసు క్రీడాపోటీలు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

గోదావరిఖని: కాళేశ్వరం జోన్‌స్థాయి పోలీసుల క్రీడాపోటీలు స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం ప్రారంభమైయ్యాయి. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రామగుండం పోలీస్ కమిషనరేట్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పోలీస్ జట్లు పాల్గొంటున్నాయి. రెండు రోజులపాటు పోటీలు నిర్వహిస్తారు. ఇందులో షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, టగ్‌ఆఫ్‌వార్, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావలిన్‌త్రో, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. క్రీడల్లో సత్తాచాటిన పోలీసు క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ప్రారంభ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ రమేశ్, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్‌రావు, ఆర్‌ఐలు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో సోమవారం(ఈనెల 20వ తేదీన) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదివారం తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల సర్వే క్షేత్రస్థాయిలో కొనసాగుతోందని, దాని పర్యవేక్షణకు అధికారులు క్షేత్రస్థాయిలో నిమగ్నమయ్యారని పేర్కొన్నారు. దీంతోనే ప్రజావాణిని రద్దు చేస్తున్నామని, జిల్లావాసులు రావొద్దని ఆయన సూచించారు.

జాబితాలో పేర్లు లేనివారు దరఖాస్తు చేసుకోండి

కోల్‌సిటీ(రామగుండం): కొత్తరేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకాల అర్హుల ఎంపిక కోసం ఈనెల 21 – 23వ తేదీ వరకు వార్డుసభలు నిర్వహిస్తామని రామగుండం బల్దియా కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీ తెలిపారు. జాబితాలో పేర్లు లేనివారు వార్డుసభల్లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ యజమాని, కుటుంబసభ్యుల పేర్లు, ఆధార్ నంబర్, చిరునామా, మొబైల్ నంబరుతో దరఖాస్తు చేయాలన్నారు.

వార్డు సభలు ఇలా..

21వ తేదీ ఉదయం : 1, 2, 11, 12, 21, 22, 31, 32, 41, 42వ డివిజన్లు.

మధ్యాహ్నం : 3, 4, 13, 14, 23, 24, 33, 34, 43, 44వ డివిజన్లు.

22న ఉదయం : 5, 6, 15, 16, 25, 26, 35, 36, 45, 46వ డివిజన్.

మధ్యాహ్నం : 7, 8, 17,18, 27, 28, 37, 38, 47, 48 డివిజన్లు

23న ఉదయం : 9, 19, 29, 39, 49వ డివిజన్లు.

మధ్యాహ్నం: 10, 20, 30, 40, 50వ డివిజన్లు.

క్రీడాపోటీలకు ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనాలనుకునే జిల్లాకు చెందిన సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు ఈనెల 21వ తేదీలోగా తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి సురేశ్ కోరారు. పేర్లు నమోదు చేసుకున్న వారు ఈనెల 23, 24వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు కావాలని సూచించారు. అందుకు సంబంధించి రవాణా, భోజన ఖర్చు క్రీడాకారులే భరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు తమ ఐడీ, ఆధార్‌కార్డు జిరాక్స్ సమర్పించాలన్నారు.

నేటినుంచి ఆర్టిజన్ల రిలే దీక్షలు

పెద్దపల్లిరూరల్: తమ అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి జిల్లా కేంద్రంలో రిలేదీక్షలు చేపడుతున్నట్లు జేఏసీ జిల్లా చైర్మన్ కిషన్‌రెడ్డి తెలిపారు. జేఎల్ఎం, సబ్ ఇంజినీర్ పోస్టులు భర్తీ చేయాలని, అర్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని ఆయన కోరారు.

సర్వే సమయం

- క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది
- అర్హులకు సంక్షేమ ఫలాలు అందించడమే సర్కారు లక్ష్యం
- రైతుభరోసా కోసం అన్నదాతల వివరాలు సేకరణ
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలుకు పకడ్బందీ చర్యలు
- కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కార్యాచరణ



ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక కోసం ఓదెల మండలం కొమిరె గ్రామంలో సర్వే చేస్తున్న సిబ్బంది(ఫైల్)

సాక్షి, పెద్దపల్లి: 'భూమి ఎంత ఉంది? ఎంత సాగు చేస్తున్నారు? ఇల్లు నిర్మించుకున్నారా? ప్లాట్లు ఉన్నాయా? ఉపాధిహామీలో కూలీలుగా ఎన్నిరోజులు పనిచేశారు?'.. జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సర్వే సందర్భంగా వినిపిస్తున్న మాటలు ఇవి. ఎన్నికల సీజన్‌లో అభ్యర్థుల గెలుపోటముల కోసం చేసే సర్వేలు కావు ఇవి.. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో సర్వే చేస్తోంది. ఇంటింటా, వాడవాడలా, పొలంగట్ల వెంట పర్యటిస్తోంది. అర్హులైన అన్నదాతలు, పేదలను ఎంపిక చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26న ప్రారంభించనుంది. అప్పటిలోగా లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ పూర్తిచేసేందుకు కార్యాచరణ వేగవంతం చేస్తోంది.

రేషన్‌కార్డుల కోసం..

జిల్లాలో 2,07,231 రేషన్ కార్డులు, 12,290 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. ప్రతీ సంక్షేమ పథకానికి రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నారు. వాటికోసం వేలాది మంది పేదలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కుల గణన వివరాల ఆధారంగా జిల్లావ్యాప్తంగా 15,255 కుటుంబాలకు రేషన్‌కార్డులు లేవని తేలింది. ఇందుకు సంబంధించిన డేటాను మండలాల వారీగా సంబంధిత అధికారులకు చేరవేసింది. ఆ డేటా ప్రకారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రేషన్‌కార్డు జారీ చేసేందుకు అర్హత కలిగి ఉందా? లేదా అని యంత్రాంగం ఆరా తీస్తోంది. అర్హుల జాబితాను ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు చేపట్టే గ్రామ, వార్డు సభల్లో ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరిస్తారు. అక్కడ ఆమోదం పొందిన తర్వాత ఈనెల 26వ తేదీన లబ్ధిదారులకు అధికారులు కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నారు.

పెట్టుబడి సాయం..

2023 యాసంగిలో జిల్లాలోని సుమారు 2.72లక్షల ఎకరాలకు రూ.5వేల చొప్పున దాదాపు రూ.139 కోట్లు రైతుబంధు సాయం అందించారు. ఈ సీజన్ నుంచి పంటలు పండించే రైతులకే రైతుభరోసా పేరిట సాయం అందించాలని, 2023 యాసంగి లబ్ధిదారుల జాబితాను ప్రామాణికంగా తీసుకొని సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు రెవెన్యూ, సర్వేయర్లు, వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో ఈనెల 16న సర్వే ప్రారంభించారు. ఈనెల 20న ముగిస్తారు. ఈ సర్వేలో గుట్టలు, వెంచర్లు, ఫాంల్యాండ్స్ తదితర వ్యవసాయేతర భూములను గుర్తిస్తున్నారు. గుర్తించిన సర్వే నంబర్లను డాటా నుంచి తొలగిస్తున్నారు. ఇప్పటివరకు 174 గ్రామాల్లో 877 ఎకరాలను ఇలా తొలగించారు. 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి సాగుకు యోగ్యం కానిభూముల వివరాలను చదివి వినిపించనున్నారు. అభ్యంతరాలను పరిశీలించి తుదిజాబితా తయారు చేస్తారు.

కౌలు రైతులు..

భూమి లేనివ్యవసాయ కూలీ కుటుంబాలకు ఏటా రూ.12వేల సాయం అందించేందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రవేశపెట్టారు. ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్న భూమి లేనివ్యవసాయ కూలీలు ఈస్కీమ్ కింద లబ్ధిపొందడానికి అర్హులు. 2023–24లో కనీసం 20రోజుల పాటు ఉపాధిహామీ పథకంలో కూలీగా పనిచేసి ఉండాలి. జిల్లాలో 1,19,011 జాబ్‌కార్డులు ఉండగా, 2023–24లో జిల్లాలో 20రోజులకుపైగా పనిచేసిన వారు దాదాపు పదివేల మంది వరకు ఉన్నారు. ఇందులో నుంచి భూమి లేనివారిని గుర్తించి వారిపేర్లను గ్రామసభల్లో చదివి వినిపిస్తారు. అభ్యంతరాలు ఉంటే ఎంపీడీవోలకు ఫిర్యాదు చేసే వీలు కల్పించారు.

ఇందిరమ్మ ఇళ్లు..

ఇందిరమ్మ ఇళ్లకోసం జిల్లావ్యాప్తంగా 1,8,0664 దరఖాస్తులు అధికారులకు వచ్చాయి. ఇందులో గ్రామాల్లో 1,28,972, పట్టణాల్లో 61,692 దరఖాస్తులు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 380 బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇప్పటివరకు 99.35 శాతం సర్వే పూర్తిచేశాయి.

గ్రామసభలే కీలకం.. ఎమ్మెల్యేల నిర్ణయమే ఫైనల్

నాలుగు సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక కోసం గురువారం నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఇందులో రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, సర్వేయర్లు, మున్సిపల్ అధికారులు పాలుపంచుకుంటున్నారు. ఈనెల 20వ తేదీ వరకు ఈ ప్రక్రియ వరకు కొనసాగనుంది. 21, 22వ తేదీల్లో గ్రామసభలు, వార్డుల్లో అర్హుల జాబితా ప్రదర్శించనున్నారు. ఈనెల 23, 24వ తేదీల్లో జిల్లాస్థాయిలో తుది జాబితా సిద్ధంచేసి ఎమ్మెల్యేల సిఫారసు మేరకు ఇన్‌చార్జి మంత్రి ఆమోదిస్తారు. ఆ తర్వాత ప్రభుత్వానికి నివేదిస్తారు. ఆ జాబితా ప్రకారం ఈనెల 26న లబ్ధిదారుల వివరాలతో కూడిన ప్రకటన ఉండే అవకాశం ఉంది.

'ఆలన' కరువై.. మూలనపడి..



గర్భిణులు, బాలింతలను క్రమం తప్పకుండా ఆస్పత్రులకు తీసుకెళ్లి, వైద్యపరీక్షలు చేశాక మళ్లీ ఇళ్లకు చేర్చే 'ఆలన' వాహనం పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని ఓ మూలన ఇలా పడిఉంది. చిన్నపాటి రిపేరు చేస్తే వినియోగంలోకి వచ్చే వాహనం.. అధికారుల నిర్లక్ష్యంతో శిథిలమై ఎందుకూ పనికిరాకుండాపోతోంది. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ వాహనం వినియోగంలోకి వస్తే మహిళలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

శిక్షణ పూర్తికాగానే ఉద్యోగం

- ఏటీసీలుగా ప్రభుత్వ ఐటీఐలు
- చివరిదశలో అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ల నిర్మాణం
- ఆరు కోర్సులు.. 172 సీట్లకు అనుమతి
- ఈ ఏడాది నుంచే విద్యార్థులకు తర్ఫీదు



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: కాలం మారుతోంది.. పోటీ పెరుగుతోంది.. నైపుణ్యానికే పెద్దపీట లభిస్తోంది.. ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఇప్పుడిదే అత్యంత కీలకంగా మారుతోంది.. దీనిని దృష్టిలో పెట్టుకున్న సర్కారు.. రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐలలో అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్లు(ఏటీసీ) ఏర్పాటు చేసింది. ఇందులో ఆరు కోర్సులు ఆఫర్ చేస్తోంది. తొలివిడతలోనే జిల్లాలోని పెద్దపల్లి, రామగుండంలో రెండు ఏటీసీలు ఏర్పాటయ్యాయి. ఇందులో ఇప్పటికే 172 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. వారికి శిక్షణ ఇచ్చేందుకు ఆరుగురు ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. 85శాతం టాటా కన్సల్టెన్సీ, 15శాతం ప్రభుత్వం నిర్వహణ బాధ్యతలు చూసుకునేలా కార్యాచరణ రూపొందించారు.

ఫిబ్రవరిలో అందుబాటులోకి భవనం..

పెద్దపల్లి, రామగుండం ఐటీఐల ఆవరణల్లో 13,500 చదరపు గజాల విస్తీర్ణంలో దాదాపు రూ.5కోట్ల వ్యయంతో ఏటీసీ భవనాలు నిర్మిస్తున్నారు. ఇవి చివరిదశకు చేరాయి. ఏటీసీ ద్వారా అందుబాటులోకి వచ్చిన ఆరు కోర్సుల్లో చేరిన 172మంది విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచే శిక్షణ ఇస్తున్నారు. అందుకు అవసరమైన సామగ్రి కూడా అందుబాటులోకి వచ్చింది.

ఏటీసీ అందించే కోర్సులు, సీట్లు

కోర్సు	సీట్లు
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్	24
ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్	20
బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్	24
ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్	40
మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్	40
మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్	24

మల్టీ నేషనల్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా..

ఏటీసీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత అప్రెంటిషిప్ ఇప్పిస్తారు. ఆ తర్వాత ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. మల్టీ నేషనల్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా కోర్సులు రూపొందించారు. యువతకు మంచి భవిష్యత్ ఇవ్వాలనేది ప్రభుత్వ ధ్యేయం. అందుకే.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ ఇప్పించి మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్లాన్ చేసింది.

అధ్యాపకులు శ్రద్ధ చూపుతున్నారు



ఈఏడాది నుంచే అందుబాటులోకి వచ్చిన ఏటీసీ ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ కోర్సులో చేరా. నైపుణ్యం పెంచేలా అధ్యాపకులు శ్రద్ధతో శిక్షణ ఇస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన వస్తోంది.

– లావణ్య, విద్యార్థిని

భావితరాలకు అనుకూలం



వృత్తి నైపుణ్య కోర్సు చదివేందుకు ఐటీఐలో చేరాలనుకున్నా. ఈ విద్యాసంవత్సరం నుంచే ఏటీసీ పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐలో అందుబాటులోకి రావడంతో అందులో చేరా. ఏటీసీ భావితరాలకు ఎంతో అనుకూలం.

– సౌమ్య, విద్యార్థిని

ఉన్నతంగా ఎదుగుతాం



ఏటీసీ తొలిబ్యాచ్ కోర్సులో చేరి శిక్షణ పొందడం సంతోషంగా ఉంది. టాటా కన్సల్టెన్సీ, ప్రభుత్వం సంయుక్తంగా యువతకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై శిక్షణ ఇవ్వడంతో భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందనే నమ్మకం కలిగింది.

– లిఖిత్, విద్యార్థి

తాత్కాలిక షెడ్లలో శిక్షణ



ఏటీసీలో శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన సామగ్రి కాలేజీకి చేరింది. ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు తాత్కాలిక షెడ్లలోనే శిక్షణ ఇస్తున్నాం. ఆధునిక పరిజ్ఞానంతో కూడిన అంశాలపై బోధిస్తున్నాం.

– శివకుమార్, ఇన్‌స్ట్రక్టర్, పెద్దపల్లి

ఉపాధి కోర్సులు



ఐటీఐలో ఈ విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి వచ్చిన ఏటీసీ కోర్సులు ఉపాధి మార్గం చూపుతాయి. ఈ – వెహికిల్స్ మరమ్మతులపై శిక్షణ ఇప్పిస్తున్నాం. ఇలా మల్టీనేషనల్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా ఏటీసీలో చేరిన విద్యార్థులకు ఏడాది, రెండేళ్ల కాలపరిమితితో శిక్షణ ఇప్పిస్తున్నాం.

– వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ, పెద్దపల్లి

గ్రామీణ క్రీడల్లో రాణించాలి



వాకర్స్‌తో కలిసి క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

- ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: గ్రామీణ యువత క్రీడా పోటీల్లో రాణించాలని ఎమ్మెల్యే విజయరమణారావు సూచించారు. హన్మంతునిపేటలో తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేత జట్లకు ఆయన జ్ఞాపికలు, నగదు అందజేసి మాట్లాడారు. నాయకులు సుధాకర్‌రావు, తీగల సదయ్య, గుజ్జుల కుమార్, సింగిల్ విండో చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు సంతోష్, సతీశ్, వాసు, శ్రీనివాస్, మహేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటవిడుపు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఎమ్మెల్యే విజయరమణారావు వాకర్స్‌తో ముచ్చటిస్తూ ఉల్లాసంగా గడిపారు. మైదానంలో ట్రాక్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరగా.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అనంతరం కాసేపు క్రికెట్ ఆడారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు అందిస్తామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పట్టణంలో జరిగిన కాంగ్రెస్ నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్లు ప్రకాశ్‌రావు, స్వరూప, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తిగా నిలవాలి

గోదావరిఖని: యువతకు స్ఫూర్తినిచ్చే సందేశాత్మక చిత్రాలను నిర్మించడం అభినందనీయమని గోదావరిఖని ఏసీపీ రమేశ్ ప్రశంసించారు. పల్లవి చరణం మీడియా క్రియేషన్స్ బ్యానర్‌పై రామగుండానికి చెందిన డైరెక్టర్ మొదుంపల్లి రామస్వామి ఆధ్వర్యంలో నిర్మించిన సదామీసేవలో షార్ట్ ఫిలింను ఏసీపీ ఆదివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ యువతకు స్ఫూర్తినిచ్చే సందేశాత్మక చిత్రాలను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీలత, రామలింగం, భూమయ్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'పోలీస్ డ్రోన్' చూస్తోంది..

- ప్రాక్టికల్‌గా పరిశీలించిన సీపీ
- ఏసీపీ కార్యాలయానికి ఒకటి
- మరోనాలుగు కొనుగోలుకు చర్యలు
- అసాంఘిక శక్తుల కట్టడికి వినియోగం



డ్రోన్ కెమెరా పనితీరు పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్, పోలీస్ అధికారులు (ఫైల్)

గోదావరిఖని: అసాంఘిక శక్తుల కట్టడికి పోలీసుశాఖ డ్రోన్ కెమెరాలు వినియోగిస్తోంది. సుమారు ఐదు కిలోమీటర్ల దూరం వరకు నిఘా ఉంచే అత్యాధునిక డ్రోన్ కెమెరాల కొనుగోలుకు రూ.50లక్షలతో ప్రతిపాదించింది. ఇప్పటికే పెద్దపల్లి ఏసీపీ కార్యాలయానికి ఒకడ్రోన్ కెమెరా కొనుగోలు చేసింది. దీనిపనితీరును సీఎం రేవంత్‌రెడ్డికి డెమో ద్వారా రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ చూపించారు. స్పందించిన సీఎం.. మరిన్ని కొనుగోలు చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో ఉంది. పెద్దపల్లి జిల్లాలో రెండు, మంచిర్యాల జిల్లాలో మూడు ఏసీపీ ఆఫీసులు పనిచేస్తున్నాయి. ఒక్కో కార్యాలయానికి ఒక్కో డ్రోన్ కెమెరా కేటాయించేలా ప్లాన్ చేశారు. పారిపోతున్న నేరస్తులు, తప్పించుకు తిరిగే ప్రమాద కారకుల ఫొటోలు, వీడియోలను హైరెజల్యూషన్‌తో చిత్రీకరించడం కోసం వీటిని వినియోగిస్తామని పోలీసులు చెబుతున్నారు.

మావోస్టుల కట్టడికి కూడా..

దట్టమైన అడవుల్లోనూ మావోయిస్టుల జాడ కనుగొనడంతోపాటు వారిని నిలువరించేందుకు పోలీసుశాఖ ఇప్పటికే డ్రోన్లు వినియోగిస్తోంది. రాష్ట్ర సరిహద్దుల్లో వీటి వినియోగాన్ని విస్తృతం చేయడం, పొరుగు రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి నక్సల్స్ చొరబడకుండా నిఘా కాసేందుకూ వీటిని వినిగియోగిస్తారని అధికారులు అంటున్నారు. సంఘ వ్యతిరేకశక్తులనూ నిలువరించే వీలు ఉంటుందని వారు వివరిస్తున్నారు.

అసాంఘిక శక్తులపైనా..

అసాంఘికశక్తులపై డ్రోన్ నిఘా పెట్టేందుకు నిర్ణయించారు. ప్రధానంగా జనసంచారం లేనిప్రాంతాల్లో పేకాట ఆడటం, గంజాయి తాగడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం వంటివారిని డ్రోన్ ద్వారా గుర్తించి పట్టుకునేందుకు యోచిస్తున్నారు.

సీఎంకు వివరించాం

ఈప్రాంత పర్యటకు వచ్చిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి డ్రోన్ వినియోగం గురించి వివరించాం. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం పెద్దపల్లి ఏసీపీ కార్యాలయంలో ఒకడ్రోన్ అందుబాటులో ఉంచాం. వీటి ద్వారా అసాంఘిక కార్యకలాపాలు అరికడతాం.

– శ్రీనివాస్, పోలీస్‌కమిషనర్, రామగుండం

'ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించండి'

గోదావరిఖని: ఛత్తీస్‌గఢ్‌లోని మారేడుపాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న డిమాండ్ చేశారు. స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నేత బడే దామోదర్‌తోపాటు 17 మంది మావోయిస్టులను హతమార్చారని ఆయన ఆరోపించారు. 2026 వరకు విప్లవ సంస్థలను నిర్మూలిస్తామని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించిన నేపథ్యంలోనే ఇప్పటివరకు 264మందిని ఎన్‌కౌంటర్లలో పోలీసులు హత్య చేశారని ఆయన ఆరోపించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, నాయకులు ఇ.నరేశ్, రామకృష్ణ, దుర్గయ్య, రాజేశం, రవికుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



కప్ అందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ అర్బన్: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో నూకలమర్రి, చెక్కపల్లి జట్లు పోటీ పడ్డాయి. విజేతగా నూకలమర్రి, రెండో స్థానంలో చెక్కపల్లి, మూడోస్థానంలో అనుపురం, నాలుగో స్థానంలో మానాల జట్లు నిలిచాయి. ఆయా జట్లకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి బహుమతి ప్రదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోనరావుపేట(వేములవాడ): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడని ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం రామన్నపల్లెకు చెందిన బత్తుల మల్లయ్య(35) ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై బావుసాయిపేట వెళ్తున్నాడు. రామన్నపల్లె శివారులో వాహనం అదుపుతప్పి, చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లయ్య తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

తండ్రీకూతురికి గాయాలు..

గోదావరిఖని(రామగుండం): రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురికి గాయాలయ్యాయి. గోదావరిఖని వన్ టౌన్ ఎస్సై రమేశ్ వివరాల ప్రకారం.. గోదావరిఖని లక్ష్మీనగర్‌కు చెందిన దొంగరి రాజమౌళి తన కూతురు తేజస్విని ఆదివారం ద్విచక్రవాహనంపై సింగరేణి జీఎం ఆఫీస్ వైపు వెళ్తున్నారు. వంకబెండు వద్ద మహమ్మద్ వహీద్ బైక్‌పై వచ్చి, ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తండ్రీకూతురు గాయపడ్డారు. కుటుంబసభ్యులు వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. రాజమౌళి తోడల్లుడు రాంచందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మద్యానికి బానిసైన ఓ మహిళ ఆత్మహత్య చేసుకుందని ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన వేముల నర్సవ్వ(45) మద్యానికి బానిసైంది. నిత్యం డబ్బుల కోసం కూతురు పూజితను వేధిస్తోంది. ఆమె డబ్బులివ్వకుండా మద్యం సేవిస్తే అవయవాలు పాడవుతాయని బెదిరించింది. దీంతో మనస్తాపానికి గురైన నర్సవ్వ శనివారం రాత్రి తమ ఇంటికి ఎదురుగా ఉన్న వ్యవసాయ బావిలో దూకింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం బావిలో చూడగా నర్సవ్వ మృతదేహం కనిపించింది. మృతురాలి భర్త రాజలింగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అటకెక్కిన ఆవాల పరిశోధన స్థానం



పాలాస వ్యవసాయ పరిశోధన స్థానం

- ప్రకటించి మూడేళ్లయినా అతీగతీ లేదు
- తాత్సారం చేస్తున్న జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి



జగిత్యాల జిల్లాలో సాగు చేసిన ఆవాల పంట

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస పరిశోధన స్థానంలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తామని ప్రకటించి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అతీగతీ లేదు. ఆవాల పరిశోధన స్థానం మంజూరులో జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి ద్వారా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా ఎలాంటి పురోగతి లేదు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా ఇప్పటికీ నిధులు విడుదల చేయకపోగా, శాస్త్రవేత్తలను నియమించలేదు. దీంతో ఆవాల పరిశోధన స్థానం అటకెక్కినట్లేనని రైతులు ముచ్చటించుకుంటున్నారు.

ఉత్తర తెలంగాణలోనే అధికం

ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోనే దాదాపు 50 వేల ఎకరాల్లో ఆవాల పంట సాగు చేస్తున్నారు. అయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులు ఈ పంట సాగుకు అనుకూలంగా ఉన్నాయి. సాగుకు అవసరమైన ఎర్రనేలలు ఆయా జిల్లాల్లో ఉండటం, సాగు నీటి వసతి, 80–90 రోజుల్లోనే పంట చేతికి రావడంతో రైతులు ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఆవాల పంట ద్వారా తేనెటీగలు ఎక్కువగా ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. రైతులు కొద్దిపాటి శిక్షణతో తేనెను ఉత్పత్తి చేసి మరింత ఆదాయం పొందవచ్చని, మన జిల్లాలో మామిడి ఎక్కువగా ఉండటంతో తేనెటీగల వల్ల పరాపరాగ సంపర్కం జరిగి పిందె, కాయ వృద్ధి చెందే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే, ఆవాల సాగుపై సలహాలు, సూచనలు కరువయ్యాయి.

ప్రైవేట్ కంపెనీల హవా

మన ప్రాంతాల్లో ప్రైవేట్ కంపెనీలు ఆవాల సాగును విస్తృతంగా చేపడుతున్నాయి. బై బ్యాక్ పద్ధతిలో విత్తనోత్పత్తి చేపట్టి ఇతర రాష్ట్రాలకు విత్తనాలు సరఫరా చేస్తున్నాయి. రైతులు విత్తనోత్పత్తి కింద సాగు చేస్తే క్వింటాల్‌కు రూ.9 వేల వరకు ఇస్తున్నాయి. సాధారణ ఆవాలకు క్వింటాల్‌కు రూ.7–8 వేలు ఇస్తుండటంతో ఎక్కువ మంది రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. దీనికి తోడు, ఆవాల పంటకు అడవి పందులు, రామచిలుకలు, కోతుల బెడద లేకపోవడం, పంటకు ముందుగానే ఏ రేటు వస్తుందో రైతులకు తెలియడంతో ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరాకు 6–8 క్వింటాళ్ల దిగుబడి.. రూ.50 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. వరి, మొక్కజొన్నకు ప్రత్యామ్నాయంగా ఆవాల పంటను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నా ఫలితం కనబడటం లేదు. దీంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా పడిపోయింది.

ఆశలు అడియాసలే..

కేంద్ర ప్రభుత్వం ఇక్కడ ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తుందని ప్రకటించడంతో స్థానిక రైతులు సంతోషించారు. కానీ, మూడేళ్లు గడిచినా ఎలాంటి పురోగతి లేకపోవడంతో వారి ఆశలు అడియాసలవుతున్నాయి. రాష్ట్ర పరిధిలోని పరిశోధన స్థానాలతో పోల్చితే, కేంద్రం ఏర్పాటు చేసే పరిశోధన స్థానాల్లో నిధులకు ఇబ్బందులు ఉండవని, వివిధ రాష్ట్రాలతో ఎప్పటికప్పుడు చర్చించుకునే అవకాశం ఉంటుందని రైతులు భ్రమించారు. తోటల్లో ప్రదర్శనలు, పరిశోధనలు చేసే అవకాశం ఉంటుందని కలలు కన్నారు.

నివేదికలకే పరిమితం

కొన్నేళ్లుగా ఉత్తర తెలంగాణ(పొలాస) పరిశోధన స్థానం పరిధిలో ఆవాల పంట సాగు చేసి, ఇక్కడి శాస్త్రవేత్తలు రాష్ట్ర వ్యవసాయ వర్సిటీతో పాటు జాతీయ వ్యవసాయ పరిశోధన మండలికి నివేదికలు పంపించారు. జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి సంతృప్తి వ్యక్తం చేస్తూ సానుకూలంగా నివేదికలు తయారు చేసి కేంద్రానికి పంపింది. కరోనాకు ముందు జరిగిన పరిశోధన మండలిలో పాల్గొన్న అప్పటి వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి పొలాసలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలని కోరారు. ఈనేపథ్యంలో కేంద్రం ప్రకటించినా అతీగతీ లేకుండా పోయింది.

కొత్తగా రెండు సబ్ జైళ్లు



కరీంనగర్ జైలు

- సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో ఏర్పాటుకు జైళ్లశాఖ ప్రతిపాదనలు
- కార్యరూపం దాల్చితే కరీంనగర్ జైలుకు తప్పనున్న భారం

సిరిసిల్ల: సమాజంలో నేరాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండగా.. ఖైదీలు, నిందితులతో జైళ్లు నిండిపోతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జైలులో వీరి సంఖ్య పరిమితి మించి ఉంది. దీంతో రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో కొత్తగా సబ్ జైళ్ల ఏర్పాటుకు జైళ్ల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది.

ఉమ్మడి జిల్లాలో మూడు..

ఉమ్మడి జిల్లాలో కరీంనగర్‌లో ఒక జైలు, జగిత్యాల, హుజూరాబాద్‌లలో సబ్ జైళ్లు ఉన్నాయి. కరీంనగర్‌లో జైలులో 300 మంది ఖైదీలకే వసతులు ఉండగా.. 350 మంది వరకు ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళా ఖైదీలకు ప్రత్యేక బారక్స్ ఉండటంతో అందరికీ పూర్తిస్థాయిలో వసతుల్లేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సమాచారం. ఇటీవల జైళ్ల శాఖ ఐజీ సౌమ్యమిశ్రా జైలును సందర్శించి, కొత్త జైళ్ల ఏర్పాటు ప్రతిపాదనలపై సమీక్షించినట్లు తెలిసింది.

నెలకు 60 మంది జైలుకు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 13 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. మొత్తం 8 కోర్టుల్లో సిరిసిల్లలో రెండు, వేములవాడలో ఒక్క మున్సిఫ్ కోర్టులున్నాయి. వీటి ద్వారా ప్రతీ నెల సగటున 60 మంది కరీంనగర్ జైలుకు వెళ్తున్నారు. సిరిసిల్లలో ఇటీవలి కలంలో భూకబ్జాలు, గంజాయి సేవించేవారు, అమ్మేవారు, దొంగతనాలు, అత్యాచారాలు, పోక్సో కేసు, హత్యలు, హత్యాయత్నాలు, చీటింగ్ కేసులు పెరుగుతున్నాయి. ఇక్కడ సబ్ జైలు ఏర్పాటు చేస్తే.. ఈ ప్రాంతానికి చెందిన నేరస్తులు, నిందితులను ఇక్కడే ఉంచే అవకాశం ఉంటుంది.

సర్దాపూర్ శివారులో ఏర్పాటు!

సబ్ జైలు కార్యరూపం దాల్చితే.. సిరిసిల్ల పట్టణ శివారులోని సర్దాపూర్ వద్ద ఏర్పాటుకు అవకాశం ఉంది. అక్కడే 17వ పోలీస్ బెటాలియన్ ఉండగా.. 100 మంది ఖైదీలకు సరిపోయే సబ్ జైలు నిర్మాణానికి అవసరమైన 20 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది.

బహుముఖ ప్రజ్ఞాశాలి.. సినారె



విశ్వంభరుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విజయేందర్ రెడ్డి, కవులు



సంక్రాంతి పురస్కార గ్రహీతలు..

కరీంనగర్ కల్చరల్: కల్మషం లేని మహా మనిషి, బహుముఖ ప్రజ్ఞాశాలి, సినీ గేయ కవి సినారె అని పిల్లల వైద్య నిపుణుడు, సినారె కవితా పురస్కార కమిటీ చైర్మన్ డాక్టర్ ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి అన్నారు. భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన విశ్వంభరుడు అనే కవితా సంకలనాన్ని నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఆవిష్కరించారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ.. సినారె బహుభాషావేత్త అని, అలుపెరగని సాహితీ దిగ్గజమని కొనియాడారు. ఉదయ సాహితీ జిల్లా అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి, కవులు అన్నాడి గజేందర్ రెడ్డి, నగునూరి రాజన్న, వేములవాడ ద్రోణాచార్యులు, గంప ఉమాపతి, బొమ్మకంటి కిషన్, పి.సత్యనారాయణరాజు, బొద్దుల లక్ష్మయ్య, రాపర్తి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

సంక్రాంతి పురస్కారాలు ప్రదానం..

పురస్కారాలు బాధ్యతను పెంచుతాయని శతాధిక గ్రంథ ప్రచురణ కర్త, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అన్నారు. దూడపాక శ్రీధర్ అధ్యక్షతన ఆదివారం కరీంనగర్ ఫిలింభవన్‌లో నిర్వహించిన శ్రీ ఆర్యాణి సకల కళా వేదిక సంక్రాంతి ప్రతిభా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గౌతమేశ్వర సాహితీ సేవా సంస్థ ప్రచురించిన ఇంతకీ నువ్వెవరు కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. జ్యోతిష్య, వాస్తు, పౌరోహిత్యం, చిందు యక్షగానం, సాహిత్యం తదితర రంగాల్లో విశేష సేవలందించిన పలువురికి సంక్రాంతి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో గాయకుడు దీక్షితుల సుబ్రహ్మణ్యం, రచయిత ఒమర్ ఎజాస్ ఖాన్, కవి, సమీక్షకుడు పొర్ల వేణుగోపాల్‌రావు, యోగా గురువు కళాధరరావు, యోగ శిక్షకుడు బుర్ర లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం

- మృతుడు నిజామాబాద్ వాసి

కోరుట్ల రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పేయింటర్స్ కాలనీకి చెందిన షేక్ రషీద్(25) శనివారం సాయంత్రం కోరుట్ల బీముని దుబ్బలో ఉండే తన సోదరి ఇంటికి వచ్చాడు. రాత్రి భోజనం చేసి, జగిత్యాలలో ఉండే తన స్నేహితులను కలిసి, ఇంటికి వెళ్తానని చెప్పి, బైక్‌పై బయలుదేరాడు. వెంకటాపూర్ శివారులో జగిత్యాల నుంచి కోరుట్ల వైపు వస్తున్న కోరుట్లకు చెందిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రషీద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం కారు రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టి, ఆగిపోయింది. ఆ వాహనంలో ఉన్న ఆడెపు రాజు, గాజంగి మహేశ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి పరిశీలించారు. మృతుడి సోదరుడు షేక్ మజీద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరు..

ఇల్లందకుంట(హుజూరాబాద్): బైక్ అదుపుతప్పి, ఓ యువకుడు మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన సకినాల నరేశ్(35) ఆదివారం సాయంత్రం బైక్‌పై ఇల్లందకుంట మండలం పాతర్లపల్లిలోని అత్తగారింటికి వెళ్తున్నాడు. హుజూరాబాద్ మండల కేంద్రంలో వాహనం అదుపుతప్పడంతో మురికి కాలువలో పడిపోయాడు. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడికి భార్య, రెండు నెలల పాప ఉన్నారు.

మిడ్‌మానేరులో తెప్పపై సిరిసిల్ల ఎస్పీ షికారు



తెప్పపై ఎస్పీ అఖిల్ మహాజన్

బోయినపల్లి(చొప్పదండి): ప్రతీరోజు శాంతిభద్రతల పర్యవేక్షణలో బిజీగా ఉండే ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం సరదాగా గడిపారు. బోయినపల్లి మండలంలోని వరదవెల్లి దత్తాత్రేయస్వామి ఆలయ పరిసరాల్లో మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌లో వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్‌తో కలిసి తెప్పపై షికారు చేశారు. కొదురుపాక ఫోర్‌లేన్ బ్రిడ్జి వరకు తెప్ప రైడ్ చేస్తూ ఆనందపడ్డారు. వారి వెంట ఎస్సై పృథ్వీధర్ ఉన్నారు.

ఆలయంలో చోరీ

కరీంనగర్‌రూరల్: దుండగులు రెండు ఆలయాల్లో చొరబడి, ఒక ఆలయ హుండీ డబ్బులను చోరీ చేశారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్ మల్లన్న, శ్రీభక్తాంజనేయస్వామి ఆలయాల్లో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. ఆదివారం తెల్లవారుజామున ఆలయాల్లో మైక్ వేసేందుకు వెళ్లిన కూకట్ల మల్లయ్య, తొగరు ఎల్లారెడ్డిలు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆంజనేయస్వామి హుండీలో డబ్బుల్లేవని, మల్లన్న ఆలయ హుండీలో సుమారు రూ.3 వేలు ఉన్నాయని తెలిపారు. బ్లూకోల్ట్స్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు.

బోర్‌వెల్ వాహనం బోల్తా

- ఐదుగురికి తీవ్ర గాయాలు



బోల్తా పడిన బోర్‌వెల్ వాహనం

మల్యాల(చొప్పదండి): బోర్‌వెల్ వాహనం చెట్టును ఢీకొని బోల్తా పడిన ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై నరేశ్‌కుమార్ వివరాల ప్రకారం.. బోర్‌వెల్ వాహనం ఆదివారం కొడిమ్యాల నుంచి జగిత్యాల వైపు వెళ్తోంది. మల్యాల మండలం ముత్యంపేట శివారులోని జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై స్టీరింగ్ ఫెయిలవడంతో చెట్టును ఢీకొట్టి, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనం నుజ్జునుజ్జవగా, లోపల ఉన్న బిహార్ కార్మికులు సురేందర్, భీమ్, బాలరాం, నిధేశ్‌లతోపాటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

శబరిమల వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

- బెంగళూరులో గుండెపోటుతో ధర్మారంవాసి మృతి



జంపయ్య (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లిన ఓ వ్యక్తి.. తిరుగు ప్రయాణంలో గుండెపోటుకు గురై, మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ధర్మారం మండల కేంద్రానికి చెందిన సమ్మంగి జంపయ్య(40) కరీంనగర్ జిల్లా బావుపేట క్వారీలో లారీడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన మిత్రులతో కలిసి శబరిమల వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వివిధ ప్రాంతాల్లో దైవ దర్శనం చేసుకుంటూ ఆదివారం బెంగళూరు చేరుకున్నాడు. అక్కడ భోజనం చేసిన తర్వాత ఛాతిలో నొప్పిగా, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉందని తెలిపాడు. దగ్గరలోని మెడికల్ షాప్‌కు వెళ్లి, మందులు తీసుకుంటుండగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అనారోగ్యంతో కోటయ్య మేస్త్రీ మృతి



కోటయ్య (ఫైల్)

వీణవంక: ఇళ్లు, ఆలయాల నిర్మాణాల్లో తనదైన ముద్ర వేసిన కోటయ్య మేస్త్రీ మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వీణవంక మండలంలోని బేతిగల్‌కు చెందిన ఇజ్జగిరి కోటయ్య(50) హుజూరాబాద్ నియోజకవర్గంలో 35 ఏళ్లలో 200కు పైగా ఇళ్లతోపాటు ఆలయాలు నిర్మించి, కోటయ్య మేస్త్రీగా పేరు తెచ్చుకున్నాడు. ఆయన వద్ద పని చేసిన ఎంతోమంది కూలీలు ప్రస్తుతం మేస్త్రీలుగా చేస్తున్నారు. రెండు రోజుల క్రితం కోటయ్య తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

కోతి దాడిలో వృద్ధురాలికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూర్‌లో ఆదివారం కోతి దాడి చేయడంతో మిట్టపల్లి వెంకటమ్మ అనే వృద్ధురాలు గాయపడిందని స్థానికులు తెలిపారు. కుటుంబసభ్యులు ఆమెను పెద్దపల్లి ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఫైనల్‌కు కరీంనగర్, వరంగల్ జట్లు



ఫైనల్ చేరిన కరీంనగర్ జిల్లా జట్టు

- నేడు హ్యాండ్‌బాల్ ఫైనల్ మ్యాచ్



హ్యాండ్‌బాల్ సెమీ ఫైనల్లో తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో కరీంనగర్, వరంగల్ జట్లు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం సాయంత్రం సెమీఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు 23–21 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొందింది. రెండో సెమీ ఫైనల్లో వరంగల్ జట్టు 28–15 పాయింట్ల తేడాతో ఆదిలాబాద్ జట్టుపై విజయం సాధించింది. సోమవారం ఉదయం ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. అలాగే, మూడు, నాలుగో స్థానాల కోసం మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది.

క్రీడలతో ఆనందం, ఆరోగ్యం..

క్రీడలతో ఆనందం, ఆరోగ్యం లభిస్తాయని ఆర్‌ఐ ఆఫ్ పోలీస్ కుమారస్వామి, సురేశ్ అన్నారు. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో రెండో రోజు రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలను వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని, ప్రారంభించారు. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలని, ఓడినవారు వచ్చే సంవత్సరం గెలుపు కోసం ప్రయత్నించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, పోటీల పరిశీలకుడు దీపక్ ప్రసాద్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బసరవేని లక్ష్మణ్, ఉపాధ్యక్షులు ఆనంద్‌కుమార్, నెమలికొండ ప్రభాకర్, కోచ్ వెంకటేశ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడిలో తల్లీకుమారులకు గాయాలు

- ఇద్దరిపై కేసు
- భూ వివాదమే కారణం



గాయపడిన పుష్పలత, కరుణాకర్, జగన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): భూ వివాదం కారణంగా జరిగిన దాడిలో తల్లీకుమారులు గాయపడ్డారు. ఈ ఘటన ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేటకు చెందిన గడ్డం ఆనందం బండలింగంపల్లిలో నర్సయ్యకు సంబంధించిన 1.08 గుంటల భూమిని 2020లో కొనుగోలు చేశాడు. ఇదే గ్రామానికి చెందిన బందుక శ్రీనివాస్, నరేశ్(తండ్రీకుమారుడు)లు నర్సయ్య విక్రయించిన భూమి తమదేనని ఆదివారం గొడవకు దిగారు. సదరు భూమి చదును చేయకుండా ఆనందం భార్య పుష్పలత, కుమారులు కరుణాకర్, జగన్‌లను అడ్డుకున్నారు. ఎందుకిలా చేస్తున్నారని ప్రశ్నించడంతో దుర్భాషలాడుతూ ఆ ముగ్గురిపై గడ్డపార, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో తల్లీకుమారులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆనందం ఫిర్యాదు మేరకు శ్రీనివాస్, నరేశ్‌లపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తెలంగాణ అబ్బాయి.. కేరళ అమ్మాయి

- దుబాయ్‌లో పరిచయమై.. పెళ్లితో ఒక్కటైన జంట



వివాహం చేసుకున్న అజయ్–అజిత

మెట్‌పల్లిరూరల్: దుబాయ్‌లో పరిచయమైన తెలంగాణ అబ్బాయి.. కేరళ అమ్మాయి పెళ్లితో ఒక్కటయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. మెట్‌పల్లి మండలం అల్లూరి సీతారామరాజు తండాకు చెందిన గుగ్లావత్ అజయ్ నాలుగేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. అక్కడ తాను పని చేస్తున్న కంపెనీలో కేరళకు చెందిన అజితతో పరిచయం ఏర్పడింది. తర్వాత అది ప్రేమగా మారింది. వివాహం చేసుకోవాలని నిశ్చయించుకొని, తమ పెద్దలను ఒప్పించారు. ఆదివారం కేరళలో అక్కడి సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నారు.

ఒక్కచోటకు 300 మంది శ్రీనివాస్‌లు



ఆత్మీయ సమ్మేళనంలో శ్రీనివాస్ పేరున్నవారు

జగిత్యాల క్రైం: ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన శ్రీనివాస్ అనే పేరున్న 300 మంది ఒక్కచోట చేరారు. ఆదివారం ఆత్మీయ సమ్మేళనం పేరిట కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్ వేదికైంది. ఈ సందర్భంగా 40 మంది రక్తదానం చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యులు ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి, వాట్సాప్ అడ్మిన్, ఏఎస్సై రాజేశుని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధి.. భక్తుల రద్దీ

వేములవాడ: వేములవాడ రాజన్నను ఆదివారం 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వీకెండ్ కావడంతో వివిధ ప్రాంతాలకు చెందినవారు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు గర్భగుడి దర్శనాలు రద్దు చేశారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సతీమణి, కుటుంబసభ్యులు పూజలు చేసి, కోడెమొక్కు చెల్లించుకున్నారు.



కోడె మొక్కు చెల్లిస్తున్న విప్ బీర్ల ఐలయ్య కుటుంబీకులు

